# భవితకు భరోసా..బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

**● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



బాగ్‌అంబర్‌పేట బుర్జుగల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట/ గోల్నాక, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో తెలంగాణ భవితకు భరోసాను ఇచ్చేలా ఉందని అంబర్‌పేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని రెడ్‌బిల్డింగ్ వద్ద డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడికి లబ్ధి చేయాలనే సంకల్పంతో కేసీఆర్ మ్యానిఫెస్టోను ప్రవేశపెట్టారని తెలిపారు. సబ్బండ వర్గాల సంక్షేమాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చిన మ్యానిఫెస్టో ఇదీ అని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి గులాబీ జెండాకు విజయం చేకూర్చనున్నదన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఇవ్వని హామీలను కూడా ఆచరణలోకి తెచ్చిన సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను వంద శాతం అమలు చేస్తాడని ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నారని చెప్పారు. సౌభాగ్యలక్ష్మి పథక కింద అర్హులైన మహిళలకు మూడువేల రూపాయల గౌరవ వేతనం, దివ్యాంగులకు పింఛన్ పెంపు, తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యమే కాకుండా మరెన్నో సంక్షేమ పథకాలను మ్యానిఫెస్టోలో పెట్టారని తెలిపారు. మరోమారు కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ కొట్టగానే ప్రకటించిన పథకాలన్నీ అమల్లోకి వస్తాయన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాగ్‌అంబర్‌పేటలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం..**


అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. ఇంటింటికీ వెళ్లి ఇప్పటికే అమలు చేసిన ప్రభుత్వ, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను కూడా ప్రజలకు తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తొమ్మిదిన్నరేండ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలనకు బీఆర్ఎస్ అభ్యర్థికి బస్తీల్లో ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసింది ప్రజలకు తెలియజేస్తున్నారు. మరోసారి తనకు అవకాశం కల్పిస్తే అంబర్‌పేటను మరింత అభివృద్ధి చేస్తానని , కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మంగళవారం అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని దర్శించుకొన్న అనంతరం బుర్జుగల్లి, చుట్టు పక్కల ప్రాంతాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బస్తీలో ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలుకరించి సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను వారికి వివరించారు. మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేయాలని, రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.



బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

**మున్సిపల్ కాలనీలో..**

మున్సిపల్ కాలనీలో మౌలిక వసతుల కల్పించి అభివృద్ధి చేశామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం కాలనీ మహిళలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత నాలుగున్నరేండ్ల తన పాలనలో నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మంచి నీటి, వరదనీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులను ముమ్మరంగా చేపట్టామని తెలిపారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆయన వివరించారు. ముఖ్యంగా నిరుపేద మహిళలకు సౌభాగ్య లక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ.3వేల జీవన భృతి, అర్హులైన మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్ వంటి ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలతో పాటు డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ..



బతుకమ్మ సంబురాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శిరీషాయాదవ్, పల్లవి, ప్రతిభ, మహిళలు

కాచిగూడ,అక్టోబర్ 17: తెలంగాణలో బతుకమ్మను మహిళలు వైభవంగా జరుపుకుంటారని కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ శిరీషాయాదవ్ అన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన సాయంత్రం అంబర్‌పేట మున్సిపాల్‌గ్రౌండ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ సంబురాలకు రావాలని మంగళవారం నింబోలిఅడ్డాలోని ఏకే భవన్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు టి.పల్లవితో కలిసి శిరీషాయాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోనే దేశ వ్యాప్తంగా బతుకమ్మ పండుగకు విశేష ఆదరణ అభించిందన్నారు. ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో మహిళలు, విద్యార్థినీనులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మడిశెట్టి ప్రతిభతో పాటు మహిళలు పాల్గొన్నారు.

## గులాబీ జెండా ఎగురవేస్తాం..



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న ప్రచారంలో పాల్గొన్న కాలేరు మణికంఠ, మహిళలు

కాచిగూడ,అక్టోబర్ 17: అంబర్‌పేట నియోజకవర్గాన్ని నలుగున్నర ఏండ్లలోనే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోట్లాది రూపాయలు వెచ్చించి అన్ని రంగాలను అభివృద్ధి చేశాడని న్యాయవాది, ఎమ్మెల్యే తనయుడు కాలేరు మణికంఠ అన్నారు. కాచిగూడ,నింబోలిఅడ్డా, బర్కత్‌పుర, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా భారీ సంఖ్యలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌ను రెండవసారి భారీ మెజార్టీతో గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఉమ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఎస్ఆర్టీసీ దసరా పండుగ ధమాకా

కాచిగూడ, అక్టోబర్ 17: దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నుంచి 30 తేదీ వరకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారందరూ లక్కీ డ్రాలో పాల్గొని, రూ.11 లక్షల విలువైన బహుమతులను గెలుచుకోవచ్చని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దసరా సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారు ప్రయాణం పూర్తి అయ్యాక టికెట్ వెనుక భాగంలో పేరు, ఫోన్ నంబర్ రాసి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. లక్కీ డ్రా విజేతలకు బహుమతులను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అందజేస్తారని పేర్కొన్నారు.

## పేద, మధ్యతరగతి సంక్షేమానికి పెద్దపీట



కాచిగూడ,అక్టోబర్ 17: సీఎం కేసీఆర్ పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రకటించడం చారిత్రాత్మకం. తెలంగాణ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను మ్యానిఫెస్టోలో చేర్చడం అభినందనీయం. దీంతో సీఎం కేసీఆర్ ముడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయం.

– వి.దానకర్ణచారి, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల తెలంగాణ కన్వీనర్

## 16 మంది రౌడీషీటర్లు బైండోవర్

కాచిగూడ, అక్టోబర్ 17: రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా పలు కేసుల్లో సంబంధం ఉన్న పీఎస్ పరిధిలోని 16 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసి ఆర్‌డీఓ ముందు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి


కాచిగూడ,అక్టోబర్ 17: ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (50)కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గ్రే రంగు జర్కిన్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వ్యక్తి వివరాల కోసం 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

### రైలు పట్టాల వెంబడి నడుచుకుంటూ ..

కాచిగూడ, అక్టోబర్ 17: రైలు పట్టాల వెంబడి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు కిందపడి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60)మంగళవారం యాకత్‌పుర–డబీర్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాల వెంబడి నడుచుకుంటూ వెళ్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై తెలుపు రంగు బనియన్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నటు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, వివరాలకు 8712568495లో సంప్రదించాలని తెలిపారు.

## శ్రీ మహా గౌరిగా మహంకాళి అమ్మవారు

అంబర్‌పేట, అక్టోబర్ 17: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలోని అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారు మంగళవారం శ్రీ మహా గౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శన మిచ్చిన బతుకమ్మకుంట మైసమ్మ అమ్మవారు



శ్రీ మహా గౌరిగా భక్తులకు దర్శనమిచ్చిన అంబర్‌పేట మహంకాళి అమ్మవారు

**శ్రీ అన్నపూర్ణాదేవిగా మైసమ్మ అమ్మవారు..**

బతుకమ్మకుంట శ్రీమైసమ్మ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చైర్మన్ కోట్ల శివకుమార్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.